క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): విజయవాడలో ఇటీవల తుఫాను సమయంలో విధులు నిర్వహించిన వినుకొండ పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులకు, ఇంజినీరింగ్ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ ఎం. సుభాష్ చంద్రబోస్ దుస్తులను పంపిణీ చేశారు. విజయవాడ పట్టణం నందు పారిశుద్ధ్య పనులు నిర్వహించి పారిశుద్ధ్య మెరుగుదలకు పాటుపడిన కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్, శానిటరీ ఇన్స్‌పెక్టర్, పి. ఆదినారాయణ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

మతుకుమల్లి శారదకు జాతీయ పురస్కారం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శారదకు శ్రీసాయి సేవా భగవాన్ ఉత్తమ జాతీయ పురస్కారం అవార్డు లభించింది. ఈ మేరకు చిలకలూరిపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో జైజై సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక, సామాజిక రంగాలతో పాటు నవ సమాజం కోసం పోరాడుతున్న శారదకు ఈ అవార్డు వరించినట్లు తెలిపారు. అవార్డు అందుకున్న శారదను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

మద్యం షాపు లక్కీడ్రా వాయిదా

వినుకొండ (నూజండ్ల): పట్టణ పరిధిలో గౌడ, గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపుకు సంబంధించిన లక్కీడ్రా వాయిదా వేసినట్లు ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు తెలిపారు. ఈ షాపు దరఖాస్తు రుసుం 2 లక్షలు నిర్ణయించి ఫిబ్రవరి 8 దరఖాస్తు స్వీకరణ చివరి తేదీగా ప్రకటించారని, దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను 10 తేదీన లక్కీడ్రా తీస్తామని అధికారులు గతంలో ప్రకటించారని వివరించారు. అయితే ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో లక్కీడ్రా ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

పార్థసారథి సేవలు అభినందనీయం



నూజెండ్ల: అంకిత భావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న శనివారపు పార్థసారధి ఇటీవల పదవీ విరమణ చేసిన సందర్భంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 41 సంవత్సరాలు ఎటువంటి వివాదాలకు తానివ్వకుండా లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించటం పలువురుకు ఆదర్శమన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన పార్థసారధిని పూలమాలలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పి.ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన లుమినా డాటామ్యాటిక్స్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 12 మంది ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కళాశాలలో సోమవారం కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. వ్రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్ నిర్వహించి 12 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారని వివరించారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3.5 లక్షల వార్షికవేతనం లభిస్తుందని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రేపు రవ్వారంలో గురునాథస్వామి తిరునాళ్ల

- ఉత్సవానికి వందేళ్ల చరిత్ర
- లక్ష మంది భక్తులు తరలివస్తారని యంత్రాంగం అంచనా
- పటిష్టంగా పోలీసు బందోబస్తు

నూజెండ్ల: భక్తుల కొంగుబంగారం రవ్వవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురునాథ స్వామి వారు. స్వామి వారి దర్శన భాగ్యంతో ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భక్తుల అచంచల విశ్వాసం. ఆ స్వామి వారి తిరునాళ్ల బుధవారం జరుగుంది. 12న జరిగే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సారథ్యంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది మాఘ శుద్ధ పౌర్ణమి తిథినాడు స్వామికి తిరునాళ్ల ఉత్సవం జరపడం ఆనవాయితీగా వస్తోంది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు నేడు జరగనున్న మెట్ల పూజల్లో పొంగళ్లు పొంగించుతారు. పురవీధుల్లో స్వామి వారి కంఠ ఆభరణాలు ఊరేగిస్తారు. స్వామివారికి త్రిలింగ స్వరూపుడు, దత్తావతారుడు వివిధ నామకరణలతో స్మరిస్తారు. వందల ఏళ్ళ నాడు స్వామి వారి ప్రదేశంలో ఒక పెద్ద వేపచెట్టు ఉండేది. సమీప గ్రామంలోని ఓ వ్యక్తి ఇల్లు నిర్మించుకునే ఉద్దేశ్యంతో గొడ్డలితో చెట్టును నరకటం ప్రారంభించాడు. మొదటి గొడ్డలి వేటుకు రక్తం, రెండవ వేటుకు



స్వామి వారి స్వరూపాలు

చీము, మూడోసారి పాలు వచ్చినప్పటికీ స్వామి వారి స్వరూపాన్ని గుర్తించని ఆ వ్యక్తి ఇంటిని నిర్మించుకున్నాడు. అయితే రెల్లు కప్పి దిగగానే నివాస గృహం అగ్నికి ఆహుతైంది.

ఇదే సమయంలో సమీపంలోని ఒక బాలుడుకి ఆవహించిన స్వామి వారు కాలిన మొద్దులను తీసుకొని వెళ్ళి పూర్వ స్థానంలో ప్రతిష్ఠించి గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించారు. దేవాలయం పైభాగాన రంధ్రం ఉన్నప్పటికీ, ఎండకు వానకు సైతం తడుస్తున్న నేటి వరకు చెక్కుచెదరకుండా స్వామి వారి స్వరూపాలు ఉండటం ఆయన మహిమకు నిదర్శంగా భక్తులు భావిస్తారు. అప్పటి నుంచి లక్కిరెడ్డి కుటుంబ సభ్యులు ధర్మకర్తలుగా, శాలివాహనులైన పారెళ్ళ కుటుంబానికి చెందిన వారు ఆలయ పూజారులుగా కొనసాగుతున్నారు. ఆలయ పరిసరాల్లో స్వామి వారి సమీపంలో శాసనం ఉండటం నేటి



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



తిరునాళ్ల ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్న రూరల్ సీఐ ప్రభాకర్‌రావు

వరకు ఎవరు చదవలేకపోవటం విశేషం. సంతాన రామలింగేశ్వర స్వామి ని మొక్కుకుంటే సంతానం కలుగుతారని నమ్మకం. అలాగే కాలభైరవుడు విగ్రహం కూడా ఉండటంతో నిత్యం స్వామి వారికి నేతితో నైవేద్యం ప్రసాద రూపంలో పెడతారు.

స్వామివారిని దర్శించుకోవాలంటే 350 మెట్లు ఉన్నప్పటికీ భక్తులు ఎలాంటి అలుపు లేకుండా కొండపైకి చేరుతారు. తిరునాళ్ల వేడుకలు సందర్భంగా తెలంగాణా రాష్ట్రం, ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల, తదితర జిల్లాల నుంచి లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పటిష్టమైన పోలీసు బందోబస్తు : రూరల్ సీఐ ప్రభాకర్‌రావు

కొండ గురునాథ తిరునాళ్ల వేడుకలు సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా డ్రోన్ కెమెరా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఆంక్షలు పాటించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీల జెండాలు, ప్రసంగాలు నిషేధమన్నారు.తిరునాళ్ల ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. ఆయనతో పాటు ఎస్సైలు కృష్ణారావు, యం.ఉమామహేశ్వరరావు, ల్లేళ్ల లోకేశ్వరరావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలపై భయం వద్దు

పీఎం మోడీ కార్యక్రమాన్ని వీక్షించిన విద్యార్థులు



నాదెండ్లలో పీఎం మోదీ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. ఉదయం 11 గంటలకు పాఠశాలలో ఏర్పాటు చేసిన టీవీ నందు ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి ప్రధాని ప్రసంగాన్ని విన్నారు. త్వరలో పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థులు భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధమవ్వాలన్నారు. సమయానికన్నా ముందే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకుని సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలు పూర్తి చేయాలన్నారు. పోటీతత్వంతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు.

కోర్టు తీర్పులతో దళిత చట్టాలు నిర్వీర్యం

రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు గోదా జాన్‌పాల్

శావల్యాపురం: సుప్రీంకోర్టు తీర్పులతో దళిత, గిరిజనుల చట్టాల నిర్వీర్యమవుతున్నాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో వ్యతిరేకించాలని లేనియడల రానున్న రోజుల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన జగనన్న స్థలాల్లో నేటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవటంతో పాటు కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శమన్నారు.

అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీలకు స్మశానభూములు పూర్తి స్థాయిలో లేవని ప్రభుత్వం స్పందించి ఒక్కో కాలనీ పరిధిలో రెండు ఎకరాలు చొప్పున ఇవ్వా లన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలైన ఎస్సీలకు అందజేయాలన్నారు. ఆయన తో పాటు మాల మహానాడు నాయకులు కొండ్రు విజయ్,గుడిపూడి ఏసురత్నం,కీర్తిపాటి వెంకటేశ్వర్లు,బొందలపాటి నాగేశ్వరరావు,రాయిని చిన్న,పెద రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. భవిష్యత్ లక్ష్యాలు నిర్దేశించుకోండి

- ఇస్రో రేంజ్ సేఫ్టీ ఆఫీసర్ జేవీఎన్ రవికుమార్
- ఉత్సాహంగా ఎన్ఈసీ జుబిలేషన్ 2కే25
- సందడి చేసిన హైద్రాబాద్ రాక్‌బ్యాండ్ బృందం

నరసరావుపేట రూరల్: ప్రతి విద్యార్థి భవిష్యత్‌పట్ల ముందు చూపు కలిగి ఉండి, అందుకు అనుగుణంగా లక్ష్యాలను సాధించడానికి కృషిచేయాలని ఇస్రో ఏస్‌డీఎస్‌సీ రేంజ్ సేఫ్టీ ఆఫీసర్ జేవీఎన్ రవికుమార్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో జుబిలేషన్ 2కే25 సాంకేతిక, సాంస్కృతిక, క్రీడల పోటీల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రవికుమార్ స్పేస్ టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిందని, దాని ఫలితాలను దేశం ఇప్పుడు అనుభవిస్తుందని తెలిపారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులు దృష్టిసారించాలని సూచించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా అంశాలలో కూడా రాణించాలని తెలిపారు. కార్యదర్శి మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సాంకేతిక పురోగతి వెన్నుముకగా నిలుస్తుందన్నారు. ప్రస్తుత సాంకేతిక వృద్ధిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్, క్లాప్ కంప్యూటింగ్, ఆటో క్లౌడ్, అంకుర సంస్థలు ముఖ్యపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంశాలకు చెందిన 52 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. హైద్రాబాద్‌కు చెందిన రాక్‌బ్యాండ్, ట్రిక్షా బృందాలు డాన్స్‌లు, పాటలతో అలరించాయి.



2కే25ను ప్రారంభిస్తున్న రవికుమార్

పిల్లలకు నులిపురుగుల వల్ల తీవ్ర ఆరోగ్య క్షీణత

పల్నాడు జిల్లా డెప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

యడ్లపాడు: నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, ఏకాగ్రత కోల్పోవడం, ఆరోగ్య క్షీణించడం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయని పల్నాడు జిల్లా డెప్యూటీ డీఎంహెచ్‌ఎం పద్మావతి చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడులో ఆమె పర్యటించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండలంలో 95 శాతం పూర్తి

యడ్లపాడు మండలంలో 5-19 వయస్సు కలిసిన అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులు 8598 మంది ఉన్నారని పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ తెలిపారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడీ సెంటర్లులో 01 నుంచి 19 సంవత్సరాలలోపు చిన్నారులకు అల్‌బెండజోల్ మందు బిళ్ళలు మింగించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: నులిపురుగులు విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతాయని, నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఎదుగుదల సాధ్యమౌతుందని ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు శుభ్రత విషయంలో అవగాహన కల్పించారు. వెల్లటూరు, బొల్లాపల్లి వైద్యులు పి.కృష్ణానాయక్, పి. శంకరనారాయణలు ఆయా పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ సందర్భంగా ఆల్‌బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేశారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులచే 'ఆల్బెండజోల్ 400ఎం.ఎల్' మందును మింగించారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: ప్రతి ఒక్కరు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు ఆరు నెలల కొకసారి క్రమం తప్పకుండా మింగాలని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. సోమవారం డీవార్మింగ్ డే సందర్భంగా మండలంలోని అన్నీ పాఠశాలలు,అంగన్‌వాడి సెంటర్ల నందు చిన్నారులకు ఆల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు మింగించే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కస్తూర్బా పాఠశాల్లో ఎంపీడీవో పి.ఉమాదేవి పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులు అందరికి వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఆల్‌బెండుజోల్ మందు బిళ్లలను మింగించటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఈకార్యక్రమంలో ఎంఈవో రవిచంద్ర,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్‌లో కే-రిడ్జి తృతీయస్థానం



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో బాలికల విభాగంలో కే-రిడ్జి పాఠశాల జట్టు తృతీయ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. మార్టూరులోని మార్కెట్‌యార్డులో నిర్వహించిన పోటీలో తమ పాఠశాల బాలికల జట్టు ఈ విజయాన్ని సాధించిందన్నారు. విద్యార్థినిలను పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ, అకాడమిక్ కోఆర్డినేటర్ పుట్టా హేమంత్ తదితరులు అభినందించారు.

స్టడీమెటీరియల్, న్యూట్రీషియన్ ఫుడ్ పంపిణీ



యడ్లపాడు: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు విద్యాజ్యోతి మెటీరియల్‌ను, అల్పాహారాన్ని అందిస్తున్నట్లు లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం టి.వెంకట రామిరెడ్డి తెలిపారు. సోమవారం హైస్కూల్‌లోని పదో తరగతి చదువుతున్న 47 మంది విద్యార్థులకు జిల్లా పరిషత్ నుంచి వచ్చిన విద్యాజ్యోతి పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే సాయంత్రం స్టడీ అవర్‌లో అల్పాహారాన్ని అందించి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

658 మందికి ఓటు హక్కు

శావల్యాపురం: ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరు సహకరించాలని తహసీల్దారు కె.సుజాత సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని 658 మంది ఓటు హక్కును కల్పించామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యడ్లపాడు: ఆత్మహత్య చేసుకుని ఆస్పత్రి పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కూలీ పనులు చేసుకునే యడ్లపాడుకు చెందిన బోయిన సాంబయ్య (35) మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో మద్యం మానేయాలని ఎన్నిమార్లు చెప్పిన అతనిలో మార్పు రాకపోవడంతో భార్య గోవిందమ్మ తన ఇద్దరు పిల్లలతో మూడేళ్ల కిందట పుట్టింటికి వెళ్లింది. ఒంటరి జీవితం గడుపుతూ మనస్తాపానికి గురైన సాంబయ్య ఆదివారం ఇంట్లో పురుగుల మందును మద్యంలో కలుపుకుని తాగాడు. గమనించిన స్థానికులు 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.బాలకృష్ణ తెలిపారు.

అగ్నిమాపక కేంద్రం కోసం హోంమంత్రికి జీవీ వినతి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసి త్వరితగతిన ఏర్పాటు చేయాలని హోంమంత్రి వంగలపూడి అనితకు ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. అవసరమైన స్థలం కూడా సిద్ధంగా ఉందని, కావల్సిన ఏర్పాట్లను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని, హోంశాఖ తరపున త్వరితగతిన అనుమతులు ఇప్పించాలని కోరారు. జీవీ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన హోంమంత్రి అనిత పరిశీలించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. సోమవారం శ్రీశైలం వెళ్తూ మార్గ మధ్యంలో వినుకొండలో ఆగిన హోంమంత్రి అనితకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. హోంమంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం జీవీ ఇంట్లో అల్పాహారం స్వీకరించారు. అనంతరం హోంమంత్రిని ఘనంగా సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరించారు.



జీవీకి పలు సూచనలు చేస్తున్న హోంమంత్రి అనిత

ఈ సందర్భంగా పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. వినుకొండలో పోలీసులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలపై కూడా చర్చకు వచ్చాయి. అనంతరం శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించేందుకు హోంమంత్రి బయలుదేరి వెళ్లారు.

ముస్లిం మత పెద్దలను మోసం చేసిన కూటమి పెద్దలు

- మసీదు ఇమామ్, మౌజమ్‌లకు అందని గౌరవ వేతనం
- ఎంఐఎం పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి

నరసరావుపేట: రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి పాలిస్తున్నారని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్ళకే పింఛన్ అందజేస్తామని, ముఖ్యపట్టణాల్లోని ఈద్గా, ఖబర్‌స్తాన్‌లకు స్థలాల కేటాయింపు చేస్తామని హామీఇచ్చి ఉన్న స్థలాలను కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. విజయవాడలో హౌజ్‌హౌస్ నిర్మిస్తామని ప్రభుత్వంలోకి వచ్చి తొమ్మిదవ నెలలోకి వచ్చినా కనీసం శంకుస్థాపన చేయలేదని అన్నారు. నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తామని, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారని తెలిపారు. ఇమామ్, మౌజన్లకు ప్రతి నెల రూ.10 వేలతో పాటు రూ.5 వేల గౌరవ వేతనం, మసీదుల నిర్వహణకు ప్రతి నెల రూ.5 వేల ఆర్థిక సహాయం, హజ్ యాత్ర చేసే ముస్లింలకు రూ.1 లక్ష వరకు సహాయం అన్నారన్నారు. దుల్హన్ పథకం కింద రూ.1 లక్ష అంటూ అలవి కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి పథకాలు అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందనే సీఎం చంద్రబాబు నాయుడు మాటలు వింటుంటే మైనార్టీలను మోసం చేసి పథకాలు దుమ్మా చేసే విధంగా ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఎంఐఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిమ్స్ సంఘాలను కలుపుకొని ఆందోళన చేపడుతుందని మౌలాలి హెచ్చరించారు.



ఉద్యోగాలకు ఎంపికైన ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 30మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి తెలిపారు. కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు డ్రోన్ పైలెట్ ఉద్యోగ నియామక కార్యక్రమంలో 119మంది విద్యార్థులు పాల్గొనగా 30మంది ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన వారికి రూ.3లక్షల వార్షిక వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, టీ ఏ, డీఏ సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు, ఆక్రమణలపై కన్నెర్ర

- ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ సూచన
- ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమాన
- వ్యాపారం సీజ్ చేస్తామంటూ హెచ్చరిక

నరసరావుపేట: పట్టణంలో సోమవారం పురపాలక అధికారులు నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు, రోడ్డు ఆక్రమణలపై కన్నెర్ర చేశారు. ఈనెల ఒకటో తేదీ నుంచి నిషేధించిన ప్లాస్టిక్ కవర్ల కోసం మెయిన్‌రోడ్డులోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అలాగే వినుకొండ రోడ్డులోని జూపల్లి సెంటర్‌లో ఉన్న రోడ్డు మార్జిన్ ఆక్రమణలను తొలగించారు. జేసీబీ సహాయంతో రోడ్లపై నిర్మించిన సిమెంట్ నిర్మాణాలను తొలగించి ట్రాక్టర్ల సహాయంతో వాటిని డంపింగ్ యార్డుకు పంపించారు. ఈసందర్భంగా కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ రోడ్డు మార్జిన్, ఫుట్‌పాత్, డ్రెయినేజ్‌లపై చేసిన ఆక్రమణల వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.



వినుకొండరోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదం

చిలకలూరిపేట ఎంవీఐ కేఎల్ రావు

నాదెండ్ల: హెల్మెట్‌లేని ప్రయాణం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని చిలకలూరిపేట మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కేఎల్ రావు చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో 16వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనవరి 16- ఈనెల 15 వరకూ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లైసెన్సు, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. త్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే కేసులు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాదాల బారిన పడకుండా నిబంధనల మేరకు వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవై కేఎల్ రావు

ప్రాథమిక దశ నుంచే ప్రతిభకు శ్రీకారం

యడ్లపాడు: ముంబాయికి చెందిన రంగోత్సవ్ సంస్థ విద్యార్థులకు నిర్వహించే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కొత్తసాలన ఏఏ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఏడుగురు పాల్గొన్నట్లు హెచ్‌ఎం షేక్ ఝున్ను సాహెబ్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ఈ పోటీల్లో కలరింగ్ విభాగంలో ఒకటో తరగతికి చెందిన గూడూరి లోకేష్, మేడిద చైతన్య, మూడో తరగతి విద్యార్థి విప్పర్ల వినయ్‌కుమార్, గ్రీటింగ్ కార్డ్స్ తయారీలో రెండో తరగతి చదువుతున్న తలికినీడి తాన్య, హ్యాండ్ రైటింగ్‌లో నాల్గో తరగతి విద్యార్థి మేడిద ఇంద్రాణి, ఐదో తరగతి విద్యార్థిని గూడూరి అమూల్య, పెయింటింగ్‌లో ఐదో తరగతి విద్యార్థి టి.సుహా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రవేశం కల్పించాలనే దృక్పథంతో వారికి ఈ పోటీల్లో పాల్గొనేలా తాను ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.



పోటీల్లో వేసిన చిత్రాలతో విద్యార్థులు